## క్లుప్తంగా

### ద్విచక్ర వాహనం స్వాధీనం



**తాడేపల్లిరూరల్:** తాడేపల్లి పట్టణ పరిధిలో గత పది రోజుల నుంచి పోలకంపాడులో పాత పెట్రోల్ బంకు వద్ద పార్క్ చేసిన ద్విచక్ర వాహనాన్ని పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. పాత పెట్రోల్ బంకులో ఏపీ 39 హెచ్‌డీ 0858 నంబరు గల రెడ్ కలర్ పల్సర్ వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు వదిలి వెళ్లారని లారీ యజమానులు తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో ఆ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. సరైన పత్రాలు చూపించి ఈ వాహనాన్ని తీసుకువెళ్లవచ్చని ఎస్‌ఐ కోటయ్య తెలిపారు.

### పలు గ్రామాల్లో ఎన్‌సీడీసీడీ సర్వే



**ఫిరంగిపురం:** మండలంలోని పలు గ్రామాల్లో ఎన్‌సీడీసీడీ (అంటు వ్యాధులు, అంటు వ్యాధులు కానివి) వాటిపై ఆరోగ్య సిబ్బంది ఇంటింటికి తిరిగి సర్వే నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారులు సోమవారం తెలిపారు. వ్యక్తులకు సంబంధించిన ఆరోగ్య వివరాలు తెలుసుకొని వారి ఎత్తు, బరువు, బీపీ , షుగర్, వంటి పరీక్షలు చేసి వివరాల యాప్‌లో నమోదు చేస్తున్నారన్నారు. దీనిద్వారా ఆ వ్యక్తి పూర్తి వివరాలు అవసరమైనప్పుడు చూసుకోవచ్చని చెప్పారు. ఇప్పటికే పలు గ్రామాల్లో 4560 మందిని సర్వేలో భాగంగా యాప్‌లో నమోదు చేసినట్లు తెలిపారు.

### నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**తాడికొండ:** రాయపూడి విద్యుత్ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ కెపాసిటీ పెంచుతున్న సందర్భంగా విద్యుత్ సరఫరాకు మంగళవారం అంతరాయం ఏర్పడుతుందని తుళ్లూరు మండల విద్యుత్ ఏఈఈ చిలకరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న 3.15 ఎంవీఏ నుంచి 5 ఎంవీఏకు పెంచేందుకు ట్రాన్స్‌ఫార్మర్‌ను మారుస్తున్నందున ఉదయం 6 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు సరఫరాను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ పరిధిలోని రాయపూడి, లింగాయపాలెం, తుళ్ళూరు, అబ్బురాజుపాలెం, దొండపాడు, బోరుపాలెం, హరిశ్చంద్రపురం గ్రామాలకు సరఫరా నిలిపివేయబడుతుంది గనుక ఆయా గ్రామాల ప్రజలు గమనించి సహకరించాలని తెలిపారు.

### కారులో వింత శబ్దాలు ఓ భ్రమ



**తాడేపల్లిరూరల్:** తాడేపల్లి పట్టణ పరిధిలోని కత్తుల పేటలో క్రిస్టియన్ శ్మశాన వాటిక వద్ద తగలబడిన కారుపై గ్రీన్ పట్టాను కప్పి ఉంచారు. రాత్రి సమయంలో ఆ కారులో నుంచి వింత శబ్దాలు వస్తున్నాయంటూ కొందరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా ఆ కారు పూర్తిగా దగ్ధమై ఉంది. నెంబరు ప్లేట్లు లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు కారు ఇక్కడ వదిలి తగలబెట్టి ఉంటారని అనుమానించారు. ఇదిలా ఉండగా అక్కడే మదర్ థెరిస్సా కాలనీలో నివసించే ఓ వ్యక్తి కారు తనదేనని, శ్మశాన వాటిక వద్దకు రాగానే షార్ట్ సర్క్యూట్ కారణంగా కారు దగ్ధం కావడంతో ఇన్సూరెన్స్ క్లెయిమ్ నిమిత్తం ఇక్కడ పార్క్ చేశానని తెలిపారు. వింత శబ్దాలు అనేది కొంతమంది భ్రమ మాత్రమేనని, ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని సీఐ కల్యాణ్ రాజు అన్నారు.

### మద్యం విక్రేత అరెస్టు

**మోతడక(తాడికొండ):** అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మోతడక బస్టాప్ సమీపంలో మద్యం విక్రయిస్తున్నాడనే సమాచారం మేరకు ఎస్‌ఐ జోజి ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. గ్రామానికి చెందిన బండ్లమూడి రమేష్ అనే వ్యక్తిని పట్టుకొని, అతని నుంచి 5 క్వార్టర్ల మద్యం, రూ.900 నగదు స్వాధీనం చేసుకొన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

### అవినీతిని అరికట్టేందుకు కృషి చేయాలి

**లక్ష్మీపురం:** పాలనలో అవినీతిని అరికట్టడం ప్రస్తుత పరిస్థితుల్లో ఓ పెద్ద సవాల్ అయినా పాలకులకు చిత్తశుద్ధి ఉంటే అవినీతిని 90 శాతం వరకు అరికట్టవచ్చని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి అన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో అవినీతిపై సోమవారం చర్చ కార్యక్రమం నిర్వహించారు. అచ్యుత ఇందుశేఖర్, ఇంజినీర్ ఎస్.సదాశివం మాట్లాడారు.

# అటకెక్కిన నగర అభివృద్ధి



ప్రగడ కోటయ్య, వైఎస్సార్ చేనేత భవనం



తెనాలి రోడ్డులోని చేనేత వస్త్ర దుకాణాలు

- కదలని తెనాలి రోడ్డు విస్తరణ పనులు
- కేటాయించని చేనేత భవన్ దుకాణాలు
- కూటమి ప్రభుత్వంలో స్తబ్ధుగా అభివృద్ధి పనులు

**మంగళగిరి:** మంగళగిరి అభివృద్ధి అటకెక్కింది. రెండేళ్ల క్రితం వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి స్థానిక ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి నగర ప్రధాన రహదారి గౌతమ బుద్ధా రోడ్డును రూ.24 కోట్లతో విస్తరించారు. తెనాలి రోడ్డులోని చేనేత వస్త్ర దుకాణదారులను ఖాళీ చేయించి, రోడ్డు విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇందులో భాగంగా చేనేత వస్త్ర దుకాణ దారులకు పాత బస్టాండ్ ఆవరణలో రూ.6.50 కోట్లతో చేనేత సూరీడు ప్రగడ కోటయ్య, దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పేర్లతో చేనేత భవనాన్ని నిర్మించారు. తెనాలి రోడ్డులోని చేనేత వస్త్ర దుకాణదారులకు దుకాణాలు కేటాయించి, రోడ్డు విస్తరణ ప్రారంభించారు. అయితే ఇంతలో సాధారణ ఎన్నికలు రావడంతో విస్తరణ ఆగిపోయింది. అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో.. దుకాణాలు కెటాయించి, రోడ్ల విస్తరణ చేపడతారని ప్రజలు భావించారు. కానీ, వారి ఆశలు నెరవేరేలా కనిపించడం లేదు. తెనాలి రోడ్డు విస్తరణతో మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ రూపు రేఖలు మారుతాయని ప్రజలు భావిస్తున్నారు. చేనేత భవనాన్ని ప్రారంభించి, తెనాలి రోడ్డు విస్తరణ చేయాలని ప్రజలు కోరుతున్నారు.

## కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



కార్మికులకు మద్దతు తెలియజేస్తున్న సీఐటీయూ నాయకులు

**తాడేపల్లిరూరల్:** తాడేపల్లి పట్టణ పరిధిలోని బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల న్యాయమైన సమస్యలను విద్యాశాఖ, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ చొరవ చూపించి పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు కోరారు. సోమవారం కార్మికులు నిర్వహిస్తున్న దీక్ష శిబిరం వద్దకు వెళ్లి మద్దతు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు కార్మికుల సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.ఆశీర్వాదం, బి.సూర్యప్రకాష్, వై.యహోషువా, ఇశ్రాయిల్, వై.సాంబయ్య, సుబ్బారావు, శారద, రమాదేవి పాల్గొన్నారు.

## ప్రజా ప్రతినిధులకు శిక్షణ తరగతులు

**తాడేపల్లిరూరల్:** దుగ్గిరాల మండల పరిధిలోని ప్రజాప్రతినిధులకు సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు ఎస్‌డీజీపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంఈవో శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణ తరగతులు మూడు విభాగాలుగా నిర్వహిస్తున్నామని, మొదటి బ్యాచ్ ఈ నెల 10,11 తేదీల్లో, రెండవ బ్యాచ్ 16,17 తేదీల్లో, మూడవ బ్యాచ్‌ను 18,19 తేదీల్లో మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరుగుతాయన్నారు.

## ఘనంగా అయ్యప్ప భక్తుల ఇరుముడులు



ఇరుముడులు ధరించిన అయ్యప్ప భక్తులు

**తాడేపల్లిరూరల్:** పాత మంగళగిరి శ్రీ సీతారామ కోవెలలో సోమవారం అయ్యప్పస్వామి మాలధారణ భక్తుల ఇరుముడల కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అయ్యప్పస్వామి మాల ధారణ, భక్తుల ఇరుముడులతో పాటు తెలుగుదేశం పార్టీ పట్టణ బీసీ సెల్ అధ్యక్షులు వాకా మాధవరావు ఇరుముడి కట్టించుకున్నారు. కోసూరు కోటేశ్వరరావు గురుస్వామి మాలధారణ భక్తులకు ఇరుముడులు కట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలీయ కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ ట్రస్ట్ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి, అర్బన్ సీఐ వినోద్ కుమార్, న్యాయవాది వాకా రామ్‌గోపాల్, నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివ శేషగిరిరావు, న్యాయవాది తాతా సాంబశివరావు, మాజీ మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ మన్నెం రమేష్‌బాబు, తాతా కోటయ్య, రేఖా సుధాకర్, దుర్గారావు, ఆశాభాల తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా సీపీఐ శత వసంతాల పండగ



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్

**తాడేపల్లిరూరల్:** సీపీఐ శత వసంతాల ఉత్సవాలను వాడవాడలా ఘనంగా నిర్వహించాలని ఆ పార్టీ కార్యదర్శి వర్గ సభ్యులు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. సోమవారం మంగళగిరి పట్టణ పరిధిలోని వేములపల్లి శ్రీకృష్ణ భగవాన్ పార్టీ కార్యాలయంలో ఏరియా కమిటీ సమావేశాన్ని పార్టీ నాయకులు బత్తురి మోహనరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అజయ్‌కుమార్ మాట్లాడుతూ వాడవాడలా, గ్రామా గ్రామాల్లో పార్టీ పతాకాలు ఎగురవేసి ఘనంగా శత వసంతాల ఉత్సవాలను నిర్వహించాలన్నారు. శ్రమ జీవుల కోసం, బడుగు బలహీన వర్గాల కోసం భారత కమ్యూనిస్టు పార్టీ ఎర్రజెండా ఆనాటి నుంచి నేటి వరకు సమస్యల పట్ల ముందుండి పోరాడుతోందన్నారు. ఎర్రజెండా పార్టీ ప్రజా సంక్షేమం కోసం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుతూ ప్రజల కోసం నిత్యం ప్రజలతో మమేకమై పోరాటాలు చేస్తూ శత వసంత ఉత్సవాలకు చేరుకోవడం గర్వంగా ఉందని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, సహాయ కార్యదర్శి యార్లగడ్డ వెంకటేశ్వరరావు, కంచర్ల కాశయ్య, మండల కార్యదర్శి జాలాది జాన్ బాబు, ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్, నియోజకవర్గ కార్యదర్శి చిన్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# కమ్యూనిస్ట్ పార్టీల డిమాండ్స్ డే

**తాడికొండ/తాడేపల్లిరూరల్:** సోలార్ విద్యుత్తు కొనుగోలులో.. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పారిశ్రామిక వేత్త అదానీని అరెస్టు చేయాలని సీపీఐ తాడికొండ నియోజకవర్గ కార్యదర్శి ముప్పాళ్ల శివశంకరరావు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం డిమాండ్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా శివశంకర్ రావు మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని మండిపడ్డారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు, సీపీఐ నాయకులు బండి సాంబయ్య, రేపూడి శ్రీనివాసరావు, కుర్ర అనిల్ కుమార్, రైతు సంఘ నాయకులు చింతల భాస్కరరావు పాల్గొన్నారు. అలాగే మంగళగిరి తహసీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం డిమాండ్స్ డే ధర్నాను నిర్వహించారు. సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య మాట్లాడుతూ ఆదానీ కంపెనీ గ్రూపులపై జరిగిన అవినీతిపై కేంద్ర ప్రభుత్వం సంయుక్త పార్లమెంట్ కమిటీ వేయాలని, మణిపూర్‌లో జరుగుతున్న అమానుష దాడులు, సంఘటనలపై పార్లమెంట్‌లో చర్చించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌ను కలసి వినతిపత్రాన్ని అందజేశారు. నాయకులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత



మాట్లాడుతున్న అత్తోట పోతురాజు

**మండడం(తాడికొండ):** బాల్య వివాహాలు బాలికలపై జరుగుతున్న హింసను అరికట్టాల్సిన బాధ్యత సమాజంలో ప్రతి ఒక్కరిపై ఉందని గుడ్ షెపర్డ్ కాన్వెంట్ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు కమ్యూనిటీ ఆర్గనైజర్ అత్తోట పోతురాజు అన్నారు. పిల్లల భద్రత-పెద్దల బాధ్యత అనే అంశంపై గుడ్ షెపర్డ్ సిస్టర్స్ సేవా సంస్థకు చెందిన చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో తుళ్లూరు మండలం మండడం గ్రామంలో నిర్వహించిన అవగాహనా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బాలికలను చిన్నచూపు చూడటం, వారికి తగిన వయస్సు రాకముందే పెళ్లి చేయడం, బాలికా హింస ఎక్కడైనా జరిగితే వెంటనే 1098, 100 నంబర్‌లకు ఫోన్ చేసి, సమాచారం అందిస్తే తక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కిషోర బాలికలు ఎదుర్కొంటున్న రక్తహీనత సమస్య నివారణ, వ్యక్తిగత పరిశుభ్రత, ఐరన్ మాత్రల వినియోగంతో కలిగే ప్రయోజనాలను అంగన్‌వాడీ టీచర్ వెంకటేశ్వరమ్మ వివరించారు. ఆశా వర్కర్ బేబి, గుడ్ షెపర్డ్ కాన్వెంట్ సిబ్బంది ఎన్.నాగమణి, బి.విజయలక్ష్మి, జె ఇశ్రాయేల్ పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

# వేధింపులపై సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు



సబ్ కలెక్టర్‌కు వివరిస్తున్న నాగేశ్వరరావు

**తెనాలి:** రూరల్ మండల గ్రామం గుడివాడలో డొంక భూములను సాగుచేసుకుంటున్న దళితుల పొలాల్లో పంటకాల్వను తవ్విన అరాచకంపై బాధితుల్లో ఒకరైన రుద్రపాటి నాగేశ్వరరావు సోమవారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో అర్జీని దాఖలు చేశారు. తనకు జరిగిన అన్యాయాన్ని సబ్ కలెక్టర్ వి.సంజనా సింహకు వివరించారు. గుడివాడ గ్రామ సర్పంచ్ గత ఎన్నికల్లో ఓటు వేయలేదన్న కక్షతో కావాలని తమ పొలాన్ని ధ్వంసం చేసినట్టు ఆరోపించారు. తమ భూమిని పూర్వం ఉన్నట్టుగా చదును చేసి అప్పగించేలా చూడాలనీ, గ్రామసర్పంచ్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదుకు ఆదేశించాలని విజ్ఞప్తి చేశారు. తన తండ్రి దావీదు ప్రభుత్వ భూమి సర్వే నెం.337లో 40 సెంట్ల పొలాన్ని ఎప్పట్నుంచో సాగుచేస్తున్నారని, 1974లో అప్పటి తహసీల్దారు తన తండ్రికి ఆర్‌సీ నెం.72/74 సాగుపట్టాను ఇచ్చినట్టు తెలిపారు. మొత్తంమీద ఇప్పటికి 90 ఏళ్లుగా తమ కుటుంబ సభ్యుల స్వాధీనంలోనే ఉందన్నారు. డొంకరోడ్డు వెడల్పు పేరుతో పంటపొలంలోకి వెళ్లేందుకు వీలులేని విధంగా తవ్వేశారని చెప్పారు. వాస్తవగా అక్కడున్న డొంక (బండ్లబాట) 20 అడుగుల వెడల్పులో ఉందని, రెండు ట్రాక్టర్లు ఎదురెదురు వచ్చినా ఇబ్బంది లేదన్నారు. దళితులమన్న వివక్షతతోనే జీవనోపాధిగా ఉన్న పొలాన్ని ధ్వంసం చేశారనీ, కాళ్లమీద పడి బతికిలాడినా వినలేదన్నారు. గ్రామంలో తన ఇంటిముందు రోడ్డు పక్కన చిన్న పశువులపాకను కూడా తీయమని పంచాయతీ కార్యదర్శిచే నోటీసు ఇప్పించారని, పోలీసులను తీసుకొచ్చి బెదిరిస్తున్నాడని ఆరోపించారు.

**మొత్తం ఏడు అర్జీలు...**

ఇదిలావుంటే సోమవారం సబ్ కలెక్టర్ వి.సంజనా సింహ నిర్వహించిన పీజీఆర్ఎస్ సమావేశానికి మొత్తం ఏడు అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూ పరిధిలోనివి రెండు కాగా, మున్సిపాలిటీ, పోలీస్, డీఎల్‌పీఓ, హౌసింగ్, ఎంపీడీఓ పరిధిలోనివి ఒక్కొక్కటి ఉన్నాయి. నిర్ణీత వ్యవధిలో పరిష్కారానికి కృషిచేస్తామని సబ్‌కలెక్టర్ వెల్లడించారు.

## యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి



మాట్లాడుతున్న తాడికొండ సీఐ కె.వాసు

**మోతడక(తాడికొండ):** యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటూ సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని సీఐ కె.వాసు పేర్కొన్నారు. సోమవారం మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ క్రైమ్ నేరాలపై అవగాహన, మాదక ద్రవ్యాల వినియోగం వల్ల అనర్థాలపై నిర్వహించిన అవగాహన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆన్‌లైన్ కొనుగోళ్లు, నగదు లావాదేవీలపై అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ప్రతి అడుగు జాగ్రత్తగా వేస్తూ సీక్రెట్ పిన్‌కోడ్ నంబర్లు, ఓటీపీ ఎవరికీ షేర్ చేయకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. చాలా మందికి అవగాహన లోపం ద్వారానే సైబర్ నేరాలు జరుగుతున్నాయని, అందుకోసమే వాటిపై అవగాహన పెంపొందించేందుకు సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విడియోను ప్రదర్శించి సైబర్ నేరాలకు అడ్డుకట్ట ఎలా వేయాలి అనే విషయాన్ని వివరించారు. విద్యార్థులు కూడా వీలైనంత వరకు తమ కుటుంబ సభ్యులు, సమాజంలోని ఇతర వ్యక్తులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించి చైతన్యవంతుల్ని చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కె.నాగశ్రీనివాసరావు, వివిధ శాఖాధిపతులు డాక్టర్ బి.తులసీరాణి, డి.శంకరరావు, నిర్వాహకులు గుమ్మడి శ్రీనివాసరావు పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

## అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన



నృత్యం చేస్తున్న చిన్నారి

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో గుంటూరు జిల్లా తాడేపల్లికి చెందిన శ్రీ ఉమా మహేశ్వర కళాక్షేత్రానికి చెందిన పలువురు చిన్నారులు ప్రదర్శించిన కూచిపూడి నృత్యం భక్తులను ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై నాట్యాచార్య కంచికట్టు వాసుదేవరావు పర్యవేక్షణలో బిందు యోషిత, హర్షిణి, సుప్రియరెడ్డి, చైత్రిక, గీతిక, హర్షిణిలు పలు కీర్తనలకు చక్కటి హావభావాలతో నృత్య ప్రదర్శన ఇచ్చారు. అనంతరం శిష్యబృందానికి అమ్మవారి దర్శనం కల్పించారు. వాసుదేవరావుతో పాటు చిన్నారులకు ఆలయ డీఈవో రత్నరాజు అమ్మవారి తీర్థ ప్రసాదాలు, శేషవస్త్రాలను అందించి అభినందించారు.

## ప్రజాసేవలో ప్రభుత్వ ఉద్యోగులు కీలకం



సుబ్రహ్మణ్యం దంపతులకు సత్కారం

**తెనాలి:** ప్రజాసేవలో ప్రభుత్వ ఉద్యోగులు కీలకమని, ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు, ప్రకటించే పథకాలనూ అమలుచేసేది వారేనని ప్రముఖ సినీరచయిత డాక్టర్ సాయి మాధవ్ బుర్రా అన్నారు. అవినీతి జోలికి పోకుండా కేవలం జీతంతోనే బాధ్యతలను నిర్వర్తించిన ఉద్యోగులను అభినందించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ సచివాలయంలో ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ విభాగంలో ఏటీఓగా ఉద్యోగ విరమణ చేసిన వల్లూరు సుబ్రహ్మణ్యం ఆత్మీయ అభినందన సభను సోమవారం నిర్వహించారు. తెనాలి రామకృష్ణ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక వీజీకే భవన్లో ఏర్పాటైన సభకు అభ్యుదయ రచయితల సంఘం (అరసం) జిల్లా అధ్యక్షుడు చెరుకుమల్లి సింగారావు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథి డాక్టర్ సాయిమాధవ్ మాట్లాడారు. ఏపీ ఎన్జీవో అసోసియేషన్ తెనాలి యూనిట్ కార్యదర్శి బేతాళ కృష్ణమోహన్ మాట్లాడుతూ, యూనియన్ సమావేశాల్లో తాను సుబ్రహ్మణ్యంతో వేదికను పంచుకున్నట్టు గుర్తుచేసుకున్నారు. డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు స్వాగతం పలికిన సభలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ కన్నెగంటి గోపీచంద్, తాడిబోయిన హరిప్రసాద్, సినీనటుడు వేమూరి విజయభాస్కర్, శ్రీనివాసరావు మాట్లాడారు. సభలో సుబ్రహ్మణ్యం దంపతులను ఘనంగా సత్కరించారు.

# విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం

**పెదకాకాని:** విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇల్లు కాలిపోయిన ఘటన తక్కెళ్ళపాడులో చోటు చేసుకుంది. పెదకాకాని మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామానికి చెందిన కోటేశ్వరరావు గత కొంతకాలంగా ఇల్లు అద్దెకు ఇచ్చాడు. ప్రస్తుతం ఆ ఇంటిలో వెంకట్రావు అతని అనుచరులు నివసిస్తున్నారు. వారు గృహోపకరణాలు వాయిదా పద్ధతిలో గ్రామాల వెంట తిరిగి బాకీ ఇవ్వడం, తిరిగి వసూలు చేసుకోవడం వంటి వ్యాపారం చేస్తున్నారు. సోమవారం కూడా సమీప గ్రామాలకు వ్యాపారం నిమిత్తం వెళ్లారు. ఇంటి నుంచి పొగలు దట్టంగా రావడంతో స్థానికులు తాళాలు పగులగొట్టి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే ఆ ఇంటిలో ఉన్న ఫ్యాన్‌లు, మిక్సీలు, గ్యాస్ పొయ్యిలు, స్పీకర్ బాక్సులు, గ్రైండర్‌లు, వంటి సామగ్రి పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక శాఖ వారికి సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. అప్పటికే సామానులు అన్నీ కాలిపోయాయి. వెంకట్రావు ఇంటికి చేరుకుని చూడగా వ్యాపారానికి తెచ్చుకున్న పరికరాలు కాలిపోయి ఉన్నాయి. షార్ట్ సర్క్యూట్ కారణంగానే ప్రమాదం జరిగి ఉంటుందని అగ్నిమాపక శాఖ వారికి వెంకట్రావు వివరించాడు. కాలిపోయిన వస్తువుల విలువ సుమారు రూ.లక్ష ఉంటుందని తెలియజేశారు.

## ప్రజా సమస్యలపై అర్జీల స్వీకరణ



కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దారు, అధికారులు

**మేడికొండూరు:** స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక జరిగింది. పలు గ్రామాల ప్రజలు తమ సమస్యలపై అర్జీలను అందజేశారు. తహసీల్దారు హరిబాబుతో పాటు పలువురు అధికారులు ఫిర్యాదులను స్వీకరించారు. అర్జీలకు సత్వరం పరిష్కారం చూపాలని తహసీల్దారు సంబంధిత అధికారులను ఆదేశించారు.